
పూర్వ విద్యార్థుల కలయిక

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1979–80వ బ్యాచ్ టెన్త్ విద్యార్థులు కలిశారు. తమ గురువులు నాగిరెడ్డి, గిరిజను సన్మానించి ఆశీస్సులు పొందారు.





చట్టం తన పని తాను చేసింది

పలమనేరు/పెద్దపంజాణి: 'చట్టం తన పని తాను చేసే సరికి మాజీ సీఎం చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ శ్రేణులు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ జీర్ణించుకోలేక పోతున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబు అరెస్ట్, ఆయనకు కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడం ప్రజల్లో హాట్ టాపిక్‌గా మారింది.

టైమ్ ఒకేలా ఉండదు



చంద్రబాబు తాను ఎంతో అనుభవమున్న నాయకుడని ఇన్నాళ్లూ జనాన్ని తన జిమ్మిక్కులతో నమ్మించగలిగారు. కానీ స్కిల్ కేసులో పక్కా ఆధారాలతో ఆయన అడ్డంగా దొరికిపోవడంతో కోర్టు రిమాండ్‌కు పంపింది. దీంట్లో తప్పేముంది? టైం అంతే. –హేమంత్‌కుమార్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్, పలమనేరు

న్యాయవ్యవస్థపై పెరిగిన నమ్మకం



వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబుకు మించిన వారు లేదు. ఎన్ని కేసులు, విచారణలు వచ్చినా స్టేలు పొంది కాలం గడిపారు. కానీ ఇప్పుడు మాత్రం ఆ పప్పులుడకలేదు. చంద్రబాబు రిమాండ్‌తో న్యాయ వ్యవస్థపై జనంలో నమ్మకం పెరిగింది.
–ఎం రెడ్డెప్ప, ఎంపీపీ, బైరెడ్డిపల్లె

చట్టానికి చుట్టం కాదు



చట్టానికి ఎవరూ చుట్టాలు కాదని చంద్రబాబు కేసులో జనానికి తేటతెల్లమైంది. ఈ కేసులో చంద్రబాబును వదిలేసి ఉంటే.. ఏ తప్పు చేసినా ఖరీదైన లాయర్లను పెట్టుకుంటే సులభంగా భయటపడొచ్చుననే ధీమా వచ్చేది. న్యాయవ్యవస్థపై ఇప్పుడు మరింత నమ్మకం పెరిగింది.–బైరెడ్డిపల్లి క్రిష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

స్కాములు చేసి తప్పించుకోలేరు



చంద్రబాబు తప్పు చేయకుంటే కోర్టులో నిరూపించుకోవాలి. అంతేగానీ స్కాములు చేసి ఎలాగైనా తప్పించుకోవాలని చూస్తే ఎలా? ప్రజా ధనాన్ని మాస్టర్‌ప్లాన్ వేసి దోచేయడం తప్పు కాదా? అని జనం నోట బాబు నానుతున్నారు ఇప్పుడు. –మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్, గంగవరం

ఈసారి బైటపడే ఛాన్స్ లేదాయె..



తనపై ఉన్న ఎన్నో కేసుల నుంచి బైటపడినట్లే దీని నుంచి కూడా బైటపడవచ్చని చంద్రబాబు భావించి ఉండొచ్చు. కానీ ఈసారి పక్కాగా సాక్ష్యాధారాలతో దొరికిపోయారు. ప్రజాధనం నియోగం అయినట్లు పక్కా ఆధారాలను కోర్టు నమ్మింది.
–మూర్తి, పాతపేట, పలమనేరు

నైతికత కోల్పోయారు



యువతకు శిక్షణ ఇస్తామని పెట్టిన సంస్థ ద్వారా కోట్లు వెనకేసుకున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో కొనసాగే నైతికత కోల్పోయారు. ఆయన చేసిన పనులేమిటో బోధపడింది టీడీపీ శ్రేణులు సైతం తమ మద్దతు ఎవరికనేది ఆలోచించుకోవాలి.–బాగారెడ్డి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, పెద్దపంజాణి

తప్పించుకోవడం అంత సులభం కాదు



చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ఆయన ప్రజాధనాన్ని షెల్ కంపెనీలతో దోచుకున్నట్టు చాలా ఆధారాలున్నాయి. ఇందుకు సంబంధించి ఓ ఐఏఎస్ ఆఫీసర్ స్టేట్‌మెంట్ చాలా కీలకమైంది. అందుకే చంద్రబాబు ఖరీదైన లాయర్‌ను పెట్టుకున్నా చట్టం ముందు బలమైన ఆధారాలుంటే ఎవరూ తప్పించుకోలేరని న్యాయవ్యవస్థ స్పష్టం చేసింది. –ఎస్.మొహిదీన్, న్యాయవాది, పలమనేరు

కుట్ర తేటతెల్లం



మాజీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన కుట్ర తేటతెల్లమైంది. కోర్టు రిమాండు విధించడం సమంజసమే. –ఎంపీపీ, రెడ్డెప్ప, పెద్దపంజాణి

నేడు ఎంపీ జన్మదిన వేడుకలు

చౌడేపల్లె/సదుం/రొంపిచెర్ల/పులిచెర్ల(కల్లూరు): రాజంపేట ఎంపీ పీవీ.మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం చౌడేపల్లె, సదుం, రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నాయకులు చెప్పా రు. చౌడేపలెలో చిత్తూరు ఎంపీ ఎన్ రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి చేతుల మీదుగా అన్నదానం చేయనున్నట్టు యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్ఎస్ యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు తెలిపారు. అలాగే ఆలయాల్లో పూజలు చేస్తామన్నారు. ఇక, ఎంపీడీఓ కార్యాలయంలో రక్తదాన శిబిరం, ప్రభుత్వాసుపత్రిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్టు సర్పంచ్ వరుణ్ తెలిపారు.

- సదుం మండల పరిషత్ కార్యాలయం వద్ద రక్తదాన శిబిరం, అలాగే బస్టాండు వద్ద పేదలకు అన్నదానం చేయనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి చెప్పారు.
- రొంపిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో రాజంపేట ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహించనున్నట్టు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి తెలిపారు.
- పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లెలో ఉదయం 9 గంటలకు నిర్వహించే ఎంపీ జన్మదిన వేడుకల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొంటారని, ఆ తర్వాత మల్లేశ్వర ఆలయానికి రూ.5కోట్లతో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేయనున్నట్టు ఎంపీపీ సురేంద్రనాధరెడ్డి పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం


పుష్పావతి


పట్టాభిరామయ్య


రోషన్ అలీఖాన్


రమేష్

పలమనేరు: పలమనేరు డివిజన్ వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో సంఘ జిల్లా గౌరవ సలహాదారు సోమచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా పట్టాభిరామయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలిగా పుష్పావతి, ప్రధాన కార్యదర్శిగా రోషన్ అలీఖాన్, ఉపాధ్యక్షులుగా రమేష్‌బాబు, గిరిధర్ మూర్తి, కార్యదర్శులుగా సుబ్రమణ్యం, సదాశివ వడయార్, కోశాధికారిగా రమేష్, కార్యవర్గ సభ్యులుగా రెడ్డి శంకర్, మహేశ్వరావు, సుశీలమ్మ ఎంపికయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం సంఘం పనిచేస్తుందని నూతన కార్యవర్గం తెలిపింది. కార్యక్రమంలో సంఘ జిల్లా కోశాధికారి ఏఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో మహా సంప్రోక్షణ

చౌడేపల్లె: పందిళ్లపల్లె పంచాయతీ నడుమూరులోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఆదివారం భక్తిప్రపత్తులతో విమానగోపుర కలశ మహా సంప్రోక్షణ, హోమ పూజలు చేశారు. ఆలయ నిర్మాణ దాత దామోదరరాజు, ధనలక్ష్మి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాలతో పూలతో అందంగా తీర్చిదిద్దారు. మహిళలు ఉపవాస దీక్షలతో పూజలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సర్పంచ్ కదిరప్ప, పలువురు నేతలు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజల్లో పెద్దిరెడ్డి తదితరులు







